క్లుప్తంగా

బీజేవైఎం రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్‌గా విజయ్‌కుమార్



మరికల్: మండలంలోని అప్పంపల్లికి చెందిన విజయ్‌కుమార్‌రెడ్డిని బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్‌గా నియమించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో విజయ్‌కుమార్‌రెడ్డికి రెండు బాధ్యతలను పార్టీ అధ్యక్షుడు భానుప్రకాశ్ అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని.. రాష్ట్ర పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

నారాయణపేట టౌన్: ఒడిశాలోని బాలాసోర్‌లో శుక్రవారం జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం రూ.20 లక్షల పరిహారం చెల్లించి ఆదుకోవాలని టీడీపీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఓం ప్రకాశ్ శనివారం కోరారు. ప్రమాదంలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలి

నారాయణపేట రూరల్: కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్ కృష్ణారెడ్డి, నర్సింహ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఖాళీలు ఉన్నప్పటికి ఆన్‌లైన్‌లో చూపకుండా బ్లాక్ చేశారని, పైరవీకారుల కోసం కేటాయిస్తే భవిష్యత్‌లో ఉద్యమం చేస్తామని పేర్కొన్నారు. అన్యాయం జరిగితే అందుకు కారణమైన వారిపై చర్యలకు పోరాటం చేస్తామ తెలిపారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



నారాయణపేట టౌన్: జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్‌కాలనీ అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి పూజలు

నారాయణపేట టౌన్: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం జిల్లాకేంద్రంలోని సాయి విజయ్‌కాలనీలో ఉన్న సాయి హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు షిర్డీ సాయిబాబా మూల విగ్రహానికి పంచామృత అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు పల్లకీసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మక్తల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండలంలోని చిట్యాలలో శుక్రవారం రాత్రి 12గంటల సమయంలో మక్తల్ పోలీసులు పట్టుకున్నారు. చిట్యాల గ్రామానికి చెందిన (టీఎస్38 1701) ట్రాక్టర్ చిట్యాలవాగు నుంచి అనుమతి లేకుండా మక్తల్‌కు ఇసుక తరలిస్తున్నదని, డ్రైవర్ చిన్న రాజుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

ఆవుల దాడిలో పలువురికి గాయాలు



మాగనూర్: మండల పరిధిలోని సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన పూజారి శివకుమార్, అతడి చిన్నమ్మ లక్ష్మి మక్తల్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా రెండు ఆవులు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడ్డారు. తర్వాత కూడా ఆవులు వారిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం అందుకున్న డయల్-100 సిబ్బంది కృష్ణప్రసాద్ యువకుడిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం అంబులెన్స్‌లో రాయచూర్‌లోని రిమ్స్‌కు తరలించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి



దామరగిద్ద మండలం లోకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏడు క్లస్టర్లలో శనివారం రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించగా చిన్నజట్రం రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో వ్యవసాయానికి పెద్దపీట వేసిన తొలి ప్రభుత్వమని, రైతుల సంక్షేమం కోసమే బీఆర్‌ఎస్ పార్టీని ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రైతులకు రైతుబంధు, చనిపోతే రైతుబీమా ఇస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణగా అన్నారు. మిషన్ కాకతీయ పథకంలో చెరువులు పూడిక తీయడంతో వేసవిలో సైతం నీరు చూస్తున్నామని గుర్తుచేశారు. భూగర్భ జలాలు పెరిగి తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నారు. సమావేశంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు వేపూరి రాములు, రైతు సమన్వయ సమితి నాయకులు వెంకట్రాములుగౌడ్, కోట్ల జగన్మోహన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణా దేశానికే ఆదర్శం..

దామరగిద్ద: రాష్ట్రంలో అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లోకుర్తిలో నిర్వహించిన రైతు దినోత్సవ వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ప్రగతి నివేదికను ఏఓ అరవింద్ చదివి వినిపించారు. అనంతరం నిర్వహించిన సామూహిక భోజనాలతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, జెడ్పీటీసీ సభ్యురాలు లావణ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు భీమయ్యగౌడ్, సర్పంచ్ మహేశ్వరి బసంత్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కొండప్ప, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.



పేట మార్కెట్‌యార్డులో సన్మానించిన రైతులతో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిరాజ్ తదితరులు

ఘనంగా రైతు దినోత్సవం..

నారాయణపేట టౌన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్తమ రైతులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిరాజ్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కన్నా జగదీశ్, రైతు సంఘాల నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

దామరగిద్ద: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేసి రైతును రాజు చేయడమే లక్ష్యంగా పని చేస్తుందని విండో అధ్యక్షుడు ఈదప్ప, సర్పంచ్ ఆశమ్మ అన్నారు. సర్పంచ్ ఆశమ్మ అధ్యక్షతన వ్యవసాయ అధికారి అరవింద్ ఆధ్వర్యంలో స్థానిక రైతువేదికలో నిర్వహించిన రైతుదినోత్సవ వేడుకలో వారు పాల్గొని మాట్లాడారు. అలాగే మండలంలోని కాన్‌కుర్తి, విఠలాపూర్, అన్నసాగర్, లోకుర్తి, బాపన్‌పల్లి, దామరగిద్ద, కంసాన్‌పల్లి, లింగారెడ్డిపల్లి రైతువేదికల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌ల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి అధ్యక్షుడు రాచప్ప, ఎంపీపీ నర్సప్ప, శరణప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతుబంధు సమితి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



దామరగిద్ద రైతువేదికలో ప్రగతి నివేదిక చదివి వినిపిస్తున్న ఏఓ అరవింద్

రైతు సంక్షేమానికి పథకాల అమలు..

మరికల్: రైతుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసిన ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని వైస్ ఎంపీపీ రవికుమార్ అన్నారు. మరికల్ రైతు వేదికలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతును రాజు చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని.. రైతుబంధు, రైతుబీమా, నిరంతర ఉచిత విద్యుత్‌వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. రాబోయే ఎన్నికల్లోనూ విజయం సాధించి మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ అని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంకోటి, ఏఓ శివకుమార్, ఎంపీడీఓ యశోదమ్మ, నాయకులు కృష్ణారెడ్డి, సంపత్, రాజేందర్‌గౌడ్, గోవర్దన్, రామస్వామి, గోపాల్, లక్ష్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.



మరికల్‌లో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రవికుమార్

25వ రోజు కొనసాగిన దీక్షలు



దీక్ష శిబిరంలో వాయిద్యాలతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న దీక్షలు శనివారం 25వ రోజుకు చేరాయి. నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు హాజరై గ్రామ వీధుల్లో వాయిద్యాలతో ఊరేగింపు చేపట్టి దీక్ష శిబిరంలో కూర్చున్నారు. కోటకొండను మండలం చేయాలంటూ డోలు, సన్నాయి వాయిస్తూ వినూతన్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు కాశీనాథ్, రాము, కెంచె శ్రీనివాస్, యాదగిరి మాట్లాడుతూ.. రాజకీయ దురుద్దేశంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. స్థానిక నాయకులు, ఎమ్మెల్యే చొరవ తీసుకొని సీఎం కేసీఆర్‌తో ప్రకటన ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుభాష్, నర్సింహులు, హన్మంతు, భీమేష్, వెంకటయ్య, శివరాజ్, బాలరాజు, నరేష్, శివ, రామస్వామి, రవి, వెంకటేశ్, యాదప్ప, నిఖిల్, అక్షయ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి రేట్లు పెంచాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలి రేట్లు పెంచాలని ఏఐపీకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని బొమ్మన్‌పాడులో కొనసాగుతున్న ఉపాధి పనులను శనివారం వారు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధిహామీని నిర్వీర్యం చేసే చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, కొలతల రేట్లు పెంచి రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు అందించి మేటీలకు పారితోషికం ఇవ్వాలన్నారు. ఇన్సూరెన్స్, సేఫ్టీ కిట్, పనిముట్లు, కనీస సౌకర్యాలపై దృష్టి సారించాలని కోరారు. గతంలో 82 రకాల పనులు చేయిస్తుండగా వాటిని కుదించి 22 రకాల పనులకు మాత్రమే అనుమతి ఇస్తున్నారని వాపోయారు. అదేవిధంగా 200 రోజుల పని కల్పించాలని కోరారు. ఏఐపీకేఎంఎస్ ప్రశాంత్, వెంకట్రాములు, హాజిమలాంగ్, కనకప్ప, రాజు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

మాగనూర్: బడిఈడు పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే శిక్షార్హులు అవుతారని మాగనూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివరాజు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఎఫ్‌ఎల్‌ఎన్‌లో భాగంగా బడిఈడు పిల్లల గుర్తింపు ప్రత్యేక సర్వే చేపట్టారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేరిృంచేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీప, విశాలక్ష్మి, స్వరూప, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో బడిఈడు పిల్లలతో ఉపాధ్యాయులు

పంట రుణమాఫీ లేకుండానే సంబరాలా?



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

మరికల్: రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీచేసి రైతు సంబరాలు నిర్వహించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు గత ప్రభుత్వాలు పంపిణీ చేసిన భూములను లాక్కొని వీధిపాలు చేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. రూ.లక్ష పంట రుణమాఫీ, తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పి రైతులను మోసం చేసిందని తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించిన తర్వాతే సంబరాలు చేసుకోవాలని కోరారు. సమావేశంలో చంద్రయ్య, వెంకటయ్య, చెన్నయ్య, రాజు, అశోక్, బాల్‌చందర్, రమేష్ పాల్గొన్నారు.

రుణమాఫీ వెంటనే చేయాలి



బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి: గతంలో ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చాక, మాఫీ చేయకుండా రైతులను మోసం చేశారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎస్‌బీఐ ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో రైతులను బ్యాంకర్లు ఇబ్బంది పెడుతున్నారన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, భానునాయక్, ఇద్రీస్, యూత్ అధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి, టెంట్ నర్సింహ, నాయకులు నాగులపల్లి నరేందర్, శ్రీనివాస్, శివరాజ, సురేష్, వెంకటయ్య, సలీం, ఫెరోజ్, వెంకట్రాములు, పలుగ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సగర్వంగా బతుకుతున్న రైతులు



కృష్ణాలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కృష్ణా: రాష్ట్రంలో రైతులు సగర్వంగా బతుకుతున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ, ఎంపీపీ పూర్ణిమ పాటిల్, మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని గుడెబల్లూర్‌లో ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచ్ మహాదేవమ్మ ఆధ్వర్యంలో రైతులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఉచిత విద్యుత్, గిట్టుబాటు ధర, రైతుబీమా, సాగునీరు, రైతుబంధు, ఎరువులు, విత్తనాలు ఇలా ప్రతి ఒక్కటీ ప్రభుత్వం రైతులకు సమకూరుస్తున్నదని అన్నారు. అనంతరం రైతులతో సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధ మహాదేవ్, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్, బీఆర్‌ఎస్ నాయకులు, రైతు సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గుడెబల్లూర్‌లో రైతులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీపీ ఆగ్రహం



సమావేశంలో సర్పంచ్ చంద్రకళ వెనక కూర్చున్న ఎంపీపీ పద్మిబాయి

ధన్వాడ: ప్రొటోకాల్ పాటించలేదని ఎంపీపీ పద్మిబాయి ఏఓ ప్రదీప్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని కొండాపూర్ రైతు వేదికలో నిర్వహించిన రైతు దినోత్సవంలో బీఆర్‌ఎస్ నాయకులతో పాటు వైస్ ఎంపీపీని ముందు వరుసలో కూర్చోబెట్టి గిరిజన మహిళను అయిన తనను వెనకి వరుసలో కూర్చోబెట్టి అవమానించారని తెలిపారు. అధికారికంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలోనూ ఎంపీపీకి గౌరవం ఇవ్వకపోవడం సరికాదని.. అధికారులు బీఆర్‌ఎస్ కార్యకర్తల్లా పని చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ అధికారిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, సురేందర్, పాండునాయక్ హెచ్చరించారు.

బకాయి కూలి వెంటనే చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

దామరగిద్ద: ఉపాధి కూలీల బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని లోకుర్తి, పిడ్డెంపల్లిలో కొనసాగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. పది వారాలుగా కూలి డబ్బులు చెల్లించకపోవడంతో కూలీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేసవిలో పని ప్రదేశాల్లో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో వడదెబ్బకు గురవుతున్నారని.. టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీటి సౌకర్యం కల్పించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజు, మహేష్, రాజు, సంజీవ్, మొగులప్ప, దేవేందర్ పాల్గొన్నారు.

రహెమానియా మసీద్ కార్యవర్గం ఎన్నిక

అమరచింత: పట్టణంలోని రహెమానియా మసీద్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు ఏబీ నిసార్ తెలిపారు. కొన్నిరోజుల కిందట వ్యక్తిగత కారణాలతో కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, కోశాధికారితో పాటు నలుగురు సభ్యులు రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైందన్నారు. ప్రస్తుతం కార్యదర్శిగా ఎండీ నబి, సంయుక్త కార్యదర్శిగా ఎస్.అలీ, ఉపాధ్యక్షులుగా సయ్యద్ కలాంపాషా, ఎండీ ఖాజాపాషా, కోశాధికారులుగా అబ్దుల్ ఫయాజ్, నసీరుద్దీన్, కమిటీ సభ్యులను పెద్దల సమక్షంలో ఎన్నుకున్నట్లు వివరించారు.

నిడుగుర్తిలో బడిబాట ర్యాలీ



నిడుగుర్తిలో విద్యార్థుల బడిబాట ర్యాలీ

ఊట్కూర్: మండలంలోని నిడుగుర్తిలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మన ఊరు–మన బడి ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారని, ఉచిత విద్య, ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీ భీమయ్య, ఉపాధ్యాయులు సునీత, వెంకటప్ప, సుజాత, సలాం, లియాకత్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

మక్తల్: మండలంలోని అనుగొండ, మాద్వార్, లింగంపల్లి, సోమేశ్వర్‌బండ, మంతన్‌గోడ్ గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడిబయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. సర్పంచ్ గడ్డం రమేష్, ఎంపీటీసీ పద్మ, ఇందిర సర్పంచ్ లక్ష్మమ్మ, హెచ్‌ఎం నర్సిరెడ్డి, ఆంజనేయులు, బాబు ఉన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవాలు

మాగనూర్: మండలంలోని కోల్పూర్ గ్రామం కృష్ణానది ఒడ్డున వెలసిన సత్యపూర్ణ స్వామి ఆరాధన మహోత్సవాలు శనివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సోమవారం మధ్యారాధన రథోత్సవం, పండితులచే ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ఉత్తరాధన రోజు లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించనున్నామని అర్చకులు యోగిశాచార్యులు తెలిపారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

నారాయణపేట రూరల్: పట్టణంలోని బీసీకాలనీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8 మంది విద్యార్థులు గురుకుల ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు హెచ్‌ఎం అశోక్ తెలిపారు. టీజీసెట్-2023లో పాల్గొని అయిదుగురు సోషల్ వెల్ఫేర్ స్కూల్, ముగ్గురు బీసీ వెల్ఫేర్ పాఠశాలకు ఎంపికైనట్లు వివరించారు. వీరిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

డిప్యూటీ కలెక్టర్‌గా ప్రేమ్‌రాజ్

కోయిల్‌కొండ: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రేమ్‌రాజ్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. రాష్ట్ర ప్రభుత్వం 19 మంది తహసీల్దార్‌లకు పదోన్నతి కల్పించడంతో ప్రేమ్‌రాజ్‌కు అవకాశం దక్కింది. దీంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

రహదారి నిర్మాణాన్ని అడ్డుకోవడం సరికాదు



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ, పుర కమిషనర్ మహ్మద్ ఖాజా

అమరచింత: సీసీ రహదారుల నిర్మాణంతో కాలనీలో కొత్తశోభ సంతరించుకుంటుందని.. పనులు అడ్డుకోవడం సరికాదని ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడు, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా అన్నారు. శనివారం పట్టణంలోని నాలుగో వార్డులో సీసీ రహదారి నిర్మాణానికి వెళ్లిన కాంట్రాక్టర్‌తో కొందరు ఘర్షణకు దిగి పనులు అడ్డుకున్నారు. దీంతో అక్కడికి చేరుకున్న కమిషనర్, ఎస్‌ఐ కాలనీవాసులతో మాట్లాడి పనులు పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణాలకుగాను సీఎం అస్యూరెన్స్ నిధులు రూ.50 లక్షలు మంజూరయ్యాయని, వీటితో నాలుగు, అయిదో వార్డులో పనులు చేపడుతున్నట్లు వివరించారు. పట్టణంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సింధు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవం.. వేంకటేశ్వరుడి కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణానికి హాజరైన భక్తులు

అమరచింత: పట్టణంలోని బీసీకాలనీలో ఉన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వేదపండితుడు బ్రహ్మశ్రీ కొల్లూరు భీమాచార్యుల ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయస్వామి బృందం వేదమంత్రోచ్ఛారణల నడుమ కార్యక్రమం కొనసాగింది. తెల్లవారుజామున స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పంచామృత అభిషేకం, హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తుల సమక్షంలో కల్యాణం జరిపించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యక్రమ నిర్వాహకుడు డా. ఉత్తరాపల్లి రామాచార్యులు పాల్గొని స్వామివారి లీలలను వివరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టణ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పారుపల్లి చింతన్న, పొబ్బతి వెంకటస్వామి, డా. సీతారాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.